

భారత రాజకీయాలు, గతం నుంచి భవిష్యత్తు వరకు, మారుతున్న ప్రజాస్వామ్య ముఖచిత్రం

భారత రాజకీయాల చరిత్రను పరిశీలిస్తే మూడు స్పష్టమైన దశలు కనిపిస్తాయి. స్వాతంత్ర్యం తర్వాత తొలి కొన్ని దశాబ్దాలు కాంగ్రెస్ ఆధిపత్యానికి చెందాయి. అనంతరం ప్రాంతీయ పార్టీల ఎదుగుదల, సంకీర్ణ ప్రభుత్వాల కాలం వచ్చింది. 2014 తర్వాత భారతీయ జనతా పార్టీ నాయకత్వంలో బలమైన కేంద్ర రాజకీయ శక్తి ఏర్పడింది. అయితే 2024 లోక్‌సభ ఎన్నికలు భారత రాజకీయాల్లో మరో మలుపుకు సంకేతమిచ్చాయి.

2024 ఎన్నికల్లో బీజేపీ 240 స్థానాలు గెలుచుకుని అతిపెద్ద పార్టీగా నిలిచింది. అయితే 2019లో ఉన్న 303 స్థానాల నుంచి గణనీయంగా తగ్గింది. ఎన్డీయే కూటమి 293 స్థానాలతో ప్రభుత్వం ఏర్పాటు చేయగా, ప్రతిపక్ష INDIA కూటమి 234 స్థానాలు సాధించింది. కాంగ్రెస్ ఒంటరిగా 99 స్థానాలు గెలుచుకోవడం ప్రతిపక్ష పునరుద్ధరణకు సంకేతంగా భావించవచ్చు. అదే సమయంలో బీజేపీ ఓట్ల శాతం సుమారు 36.6%, కాంగ్రెస్‌కు సుమారు 21.2% ఉండటం భారత రాజకీయాల్లో ఏ ఒక్క పార్టీకి సంపూర్ణ ప్రజాభిప్రాయంపై ఏకపక్ష హక్కు లేదనే వాస్తవాన్ని గుర్తుచేస్తోంది.

వర్తమాన రాజకీయాల్లో అసలు ప్రశ్న అధికార మార్పు మాత్రమే కాదు, ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రజల విశ్వాసం కూడా. యువతకు ఉద్యోగాలు, నాణ్యమైన విద్య, పరీక్షల పారదర్శకత, పెరుగుతున్న జీవన వ్యయం ప్రధాన సమస్యలుగా మారాయి. తాజా విశ్లేషణల ప్రకారం యువతలో నిరుద్యోగం, ముఖ్యంగా చదువుకున్న యువకుల్లో ఉద్యోగ అవకాశాల కొరత, తీవ్రమైన రాజకీయ అసంతృప్తికి కారణమవుతోంది. భారత ఓటర్లలో 30 సంవత్సరాల లోపు వారు దాదాపు నాలుగో వంతు ఉన్నారన్న అంచనా రాజకీయ పార్టీలకు హెచ్చరిక.


ఈ నేపథ్యంలో జెన్‌జెడ్ నిరసనలు కొత్త రాజకీయ భాషను సృష్టిస్తున్నాయి. సంప్రదాయ పార్టీ కార్యాలయాల కంటే సోషల్ మీడియా, వ్యంగ్యం, డిజిటల్ ప్రచారం ద్వారా యువత వేగంగా సంఘటితమవుతోంది. పరీక్షా అవకతవకలు, నిరుద్యోగం వంటి అంశాలపై ప్రారంభమైన ఉద్యమాలు ఇప్పుడు పాలనలో జవాబుదారీతనం, ఎన్నికల ప్రక్రియపై విశ్వాసం వంటి విస్తృత ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ఒక మంత్రి రాజీనామా వరకు దారితీసిన యువజన ఉద్యమం, ప్రజాస్వామ్యంలో వీధి నిరసన కూడా ఒక రాజకీయ శక్తేనని చూపింది. అయితే యువజన ఆందోళనలను ఏ పార్టీ అయినా పూర్తిగా తన రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవాలని ప్రయత్నిస్తే, వాటి స్వతంత్రత దెబ్బతినే ప్రమాదం కూడా ఉంది.

ప్రస్తుతం ప్రతిపక్ష పార్టీల ఐక్యత బీజేపీకి ప్రధాన రాజకీయ సవాలుగా కనిపిస్తోంది. అయితే బీజేపీకి వ్యతిరేకత మాత్రమే ప్రతిపక్ష ఐక్యతకు శాశ్వత పునాది కాలేదు. కాంగ్రెస్, ప్రాంతీయ పార్టీలు, వామపక్షాలు తమ సిద్ధాంత భేదాలను పక్కనబెట్టి ప్రత్యామ్నాయ ఆర్థిక, సామాజిక, పరిపాలనా విధానాన్ని ప్రజల ముందు ఉంచాలి. తాజా ఢిల్లీ నిరసనల్లో ప్రతిపక్ష కూటమి ఓటరు జాబితాల సవరణపై ప్రశ్నలు లేవనెత్తగా, ప్రభుత్వం మరియు ఎన్నికల సంఘం మాత్రం అనర్హ, నకిలీ పేర్ల తొలగింపే లక్ష్యమని చెబుతున్నాయి. కాబట్టి ఆరోపణలకు తుది తీర్పు రాజకీయ నినాదాలతో కాదు, పారదర్శక విచారణ, నిర్ధారించదగిన ఆధారాలతో రావాలి.

మైనారిటీ వర్గాల్లో ప్రభుత్వ విధానాలపై ఆందోళనలు, ప్రతిపక్షానికి పెరుగుతున్న మద్దతు రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేయవచ్చు.

భారత రాజకీయాల భవిష్యత్తు బీజేపీ ఓడుతుందా, ప్రతిపక్షం గెలుస్తుందా అన్న ఒక్క ప్రశ్నపై ఆధారపడదు. జెన్‌జెడ్ యువత తమ ఆగ్రహాన్ని ఓటు శక్తిగా మార్చగలరా? ప్రతిపక్షం ఐక్యతను ప్రత్యామ్నాయ పాలనా నమూనాగా మలచగలదా? అధికార పార్టీ ప్రజల అసంతృప్తిని వినీ విధానాలను సరిదిద్దగలదా? అన్న ప్రశ్నలే నిర్ణయాత్మకం.

బలమైన ప్రభుత్వం అవసరమే. అంతే బలమైన ప్రతిపక్షం కూడా ప్రజాస్వామ్యానికి అవసరం. అధికారానికి జవాబుదారీతనం, ప్రతిపక్షానికి నిర్మాణాత్మకత, యువతకు అవకాశాలు, ఈ మూడు సమతుల్యంగా ఉన్నప్పుడే భారత రాజకీయాల భవిష్యత్తు మరింత పరిపక్వంగా ఉంటుంది. ప్రజాస్వామ్యంలో చివరికి గెలవాల్సింది ఏ పార్టీ కాదు, ప్రజల విశ్వాసం, రాజ్యాంగ విలువలు మరియు భారత భవిష్యత్తే.



— కొలను వెంకటేశ్వర రెడ్డి
SP Jails (Retd.)

ఇంటర్ పరీక్ష ఫీజుకు కాలేజీల మెలికలు!

- కాలేజీ ఫీజు చెల్లిస్తేనే పరీక్ష ఫీజు.. రికార్డుల పేరుతోనూ అదనపు వసూళ్లు?
- సూపర్ రికార్డులు కావాలంటే 60 శాతం ఫీజు.. పరీక్ష ఫీజుకు 75 శాతం చెల్లించాలంటూ ఒత్తిడి!
- కేవలం పది రోజుల వ్యవధిలోనే మరో 15 శాతం ఫీజు చెల్లించాలా? తల్లిదండ్రుల ఆవేదన



హైదరాబాద్, దశ ప్రతినిధి: తెలంగాణలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపు గడువు ప్రారంభం కావడంతో ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలల ఫీజుల వసూళ్ల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. పరీక్ష ఫీజు చెల్లించేందుకు వెళ్లిన విద్యార్థులకు కొన్ని కళాశాలల యాజమాన్యాలు కళాశాల ఫీజు బకాయిలు కూడా చెల్లించాలని షరతులు విధిస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బోర్డు నిర్ణయించిన పరీక్ష ఫీజును విడిగా చెల్లించే అవకాశం కల్పించకుండా కళాశాల ఫీజుతో ముడిపెట్టడం విద్యార్థుల తల్లిదండ్రులకు భారంగా మారుతోంది.

రికార్డుల పేరుతోనూ ఫీజుల ఒత్తిడి!

ఇంటర్మీడియట్ విద్యార్థులకు అవసరమైన ప్రాక్టికల్ రికార్డులు, సూపర్ రికార్డుల విషయంలోనూ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఆర్థిక భారం మోపుతున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సూపర్ రికార్డులు అందించాలంటే ముందుగా కళాశాల ఫీజులో 60 శాతం చెల్లించాలని, పరీక్ష ఫీజు కట్టాలంటే మొత్తం ఫీజులో 75 శాతం చెల్లించాల్సిందేనని కొన్ని కళాశాలలు ఒత్తిడి చేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. అంటే సూపర్ రికార్డుల కోసం 60 శాతం ఫీజు చెల్లించిన విద్యార్థులు, కేవలం పది రోజుల వ్యవధిలోనే మరో 15 శాతం ఫీజు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. పది రోజుల వ్యవధిలోనే అదనపు ఫీజు చెల్లించాలంటూ ఒత్తిడి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.

ఒకే కాలేజీ.. ఒకే తరగతి.. వేర్వేరు ఫీజులు!

మరోవైపు ఒకే కళాశాలలో, ఒకే గ్రూపులో, ఒకే తరగతిలో చదువుతున్న విద్యార్థుల నుంచి కూడా వేర్వేరు మొత్తాల్లో ఫీజులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకే తరగతిలో చదువుతున్న విద్యార్థులకు ఒక్కొక్కరికి ఒక్కో విధంగా ఫీజులు నిర్ణయించడం వెనుక కారణమేమిటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఫీజుల వసూళ్లలో పారదర్శకత లేకపోవడం, యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి.

పరీక్ష ఫీజు గడువు ఇదే..

తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించిన 2027 మార్చి పబ్లిక్ పరీక్షల ఫీజు షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 26 నుంచి నవంబర్ 9 వరకు ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా పరీక్ష ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉంది. ఆ తర్వాత ఆలస్య రుసుములతో ఫీజు చెల్లింపులకు గడువులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో నిర్ణీత గడువులో పరీక్ష ఫీజు చెల్లించాలంటే కళాశాల ఫీజు బకాయిలు కూడా చెల్లించాల్సిందేనంటూ కొన్ని యాజమాన్యాలు షరతులు విధిస్తున్నట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు.

గతంలోనే బోర్డు స్పష్టమైన ఆదేశాలు

ఇంటర్మీడియట్ పరీక్ష ఫీజును కళాశాల ట్యూషన్ ఫీజుతో ముడిపెట్టకూడదని తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు గతంలోనే స్పష్టం చేసింది. 2021 ఫిబ్రవరిలో ప్రైవేట్ జూనియర్ కళాశాలలకు ఆదేశాలు జారీ చేస్తూ, విద్యార్థుల నుంచి పరీక్ష ఫీజును ఎలాంటి షరతులు లేకుండా స్వీకరించాలని, నిబంధనల ఉల్లంఘనను తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించింది. అలాగే 2026 జూలైలో ఫీజు బకాయిల పేరుతో విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను నిలిపివేయకూడదని బోర్డు ఆదేశాలు జారీ చేసినట్లు వార్తలు వెలువడ్డాయి.

తల్లిదండ్రుల డిమాండ్లు ఇవే..

కళాశాల ఫీజుతో సంబంధం లేకుండా బోర్డు నిర్ణయించిన పరీక్ష ఫీజును విడిగా చెల్లించే అవకాశం కల్పించాలి.

సూపర్ రికార్డులు, ప్రాక్టికల్ రికార్డుల పేరుతో వసూలు చేస్తున్న మొత్తాలపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలి.

పరీక్ష ఫీజు చెల్లింపునకు కళాశాల ఫీజును షరతుగా విధించే యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి.

ఒకే తరగతిలో విద్యార్థుల నుంచి వేర్వేరు ఫీజులు వసూలు చేస్తున్న అంశంపై విచారణ జరపాలి.

పది రోజుల వ్యవధిలోనే అదనంగా 15 శాతం ఫీజు చెల్లించాలంటూ విద్యార్థులపై ఒత్తిడి చేయకుండా చూడాలి.

ఇంటర్మీడియట్ విద్యార్థుల భవిష్యత్తుకు కీలకమైన దశలో ఫీజుల పేరుతో ఇబ్బందులకు గురిచేయడం సరికాదని తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. కళాశాల ఫీజుల వివాదాల కారణంగా విద్యార్థుల పరీక్షలకు ఎలాంటి ఆటంకం కలగకూడదని కోరుతున్నారు. ఇంటర్మీడియట్ బోర్డు ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై తక్షణమే స్పందించి, ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో ఫీజుల వసూళ్లపై సమగ్ర విచారణ చేపట్టి విద్యార్థులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నవంబర్ 15న నల్లగొండలో జరిగే ఏఐకేఎస్ బహిరంగ సభను జయప్రదం చేయాలి



- రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జల్లెల పెంటయ్య

దశ, రామన్నపేట: నవంబర్ 15 నుంచి 18 వరకు నల్లగొండలో జరిగే అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) 36వ జాతీయ మహాసభల సందర్భంగా 15న నిర్వహించే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జల్లెల పెంటయ్య పిలుపునిచ్చారు. జాతీయ మహాసభల ప్రచారంలో భాగంగా రామన్నపేట మండల కేంద్రంలో రెడ్ బెలూన్లను ఎగురవేసి మహాసభల జయప్రదానికి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై జాతీయ స్థాయిలో చర్చించి, రైతుల హక్కులు, వ్యవసాయ రంగ పరిరక్షణకోసం భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందించేందుకు ఈ మహాసభలు వేదిక కానున్నాయని తెలిపారు. దేశవ్యాప్తంగా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు, పంటలకు గిట్టుబాటు ధరలు, రైతుల రుణభారం, సాగు ఖర్చుల పెరుగుదల వంటి అంశాలపై మహాసభల్లో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. రైతాంగ ఐక్యతను చాటుతూ నవంబర్ 15న నల్లగొండలో జరిగే బహిరంగ సభకు రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, రైతు సంఘం నాయకులు కందుల హనుమంతు, గొరిగే సోములు, బావండ్లపల్లి బాలరాజు, నీల అయిలయ్య, అప్పం సురేందర్, శానగొండ రాము, మార్త భూపాల్ రెడ్డి, జల్లెల మల్లేష్ పాల్గొన్నారు.



ఓయూలో వసతి గృహాల కూల్చివేత యత్నాలను విరమించాలి

- విద్యుత్, నీటి సరఫరా నిలిపివేతపై విద్యార్థి సంఘాల ఆగ్రహం

దశ ఓయూ: ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులకు ఆశ్రయంగా ఉన్న ఈ1, డీ, ఈ2 తదితర వసతి గృహాలను కూల్చివేసే ప్రయత్నాలను అధికారులు వెంటనే విరమించుకోవాలని ఓయూ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. వసతి గృహాలకు విద్యుత్, నీటి సరఫరా నిలిపివేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల చర్యలతో న్యాయ విద్యార్థులు, నిరుద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

విశ్వవిద్యాలయ అధికారులు వెంటనే తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతారని హెచ్చరించారు. ఈ మేరకు తమ నిరసనను తెలియజేస్తూ చీఫ్ వార్డెన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓయూ బీఆర్ఎస్వీ నాయకులు కొంపెల్లి నరేష్, దశరథ్, నాగరాజు, సురేష్, రోహన్, సతీష్, శ్రవణ్, అరుణ్, మల్లేష్, సందీప్, వెంకట్, పీడీఎస్‌యూ నాయకుడు నాగరాజు, బీసీ విద్యార్థి సంఘం నాయకుడు సైదులు తదితరులు పాల్గొన్నారు.

బషీర్‌బాగ్‌లో అమిత్ షా పాదయాత్రకు భారీగా తరలివెళ్లిన బీజేపీ శ్రేణులు

- హెచ్ఎంటీ నగర్ డివిజన్ నుంచి పోతగాని గోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో భారీగా హాజరు




దశ ఓయూ: బషీర్‌బాగ్ చౌరస్తాలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేపట్టిన పాదయాత్రకు మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో హెచ్ఎంటీ నగర్ డివిజన్ నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో అమిత్ షా ప్రసంగిస్తూ.. ఎస్ఐఆర్, ఈవీఎంలపై విమర్శలు చేసిన కాంగ్రెస్ నాయకులు, తాము కోరుకున్న బ్యాలెట్ విధానంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారని వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు తమ వైఖరిని మార్చుకోవాలని అన్నారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు చంద్రమౌళి, కార్మిక విభాగం జిల్లా కన్వీనర్ యోగేశ్వర్ రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ రెడ్డి, హన్మంత్ బిరాదర్, గందమల గోపి, రాజిరెడ్డి, సురేందర్ స్వామి, శేఖర్ గుప్తా, వేణుగోపాల్, పోతగాని విజయ గోపాల్ గౌడ్, మంజులవాణి, పార్వతి తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఉస్మానియాలో 70 శాతానికి పైగా ప్రొఫెసర్ పోస్టులు ఖాళీ

- 252 పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వడం సిగ్గుచేటు
- ఏబీవీపీ ఓయూ అధ్యక్షుడు గెల్లు శేఖర్

దశ ఓయూ: ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 70 శాతానికి పైగా ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ కేవలం 252 పోస్టుల భర్తీకి మాత్రమే నోటిఫికేషన్ విడుదల చేయడం సిగ్గుచేటని ఏబీవీపీ ఉస్మానియా యూనివర్సిటీ శాఖ అధ్యక్షుడు గెల్లు శేఖర్ విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దాదాపు 13 ఏళ్లు గడుస్తున్నా విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల నియామకాలు పూర్తిస్థాయిలో జరగకపోవడం దురదృష్టకరమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నియామకాలు చేపట్టకపోవడంతో ఉన్నత విద్య, పరిశోధన రంగాలు తీవ్రంగా నష్టపోయాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే యూనివర్సిటీల పరిస్థితి మారుతుందని ఆశించిన విద్యార్థులకు నిరాశే మిగిలిందన్నారు.



ఉస్మానియా యూనివర్సిటీలో 2013లో మంజూరైన 1,267 ప్రొఫెసర్ పోస్టులకు గాను ప్రస్తుతం కేవలం 341 మంది మాత్రమే రెగ్యులర్ ప్రొఫెసర్లు పనిచేస్తున్నారని, 940కి పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. 2025 డిసెంబరులో యూనివర్సిటీని సందర్శించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని పోస్టులను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అయితే తాజాగా 252 పోస్టులకే నోటిఫికేషన్ విడుదల చేయడం విద్యార్థులను మోసం చేయడమేనని మండిపడ్డారు. ముఖ్యంగా సైన్స్ కళాశాలలోని ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఆస్ట్రానమీ, మ్యాథమెటిక్స్ వంటి కీలక విభాగాలకు ప్రొఫెసర్ పోస్టులు కేటాయించకపోవడం ఆందోళనకరమన్నారు.

యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీకి ఒక్క పోస్టు కూడా కేటాయించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. అధ్యాపకుల కొరతతో విద్యార్థుల విద్యా ప్రమాణాలు, పరిశోధన అవకాశాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉస్మానియా యూనివర్సిటీకి ప్రత్యేకంగా పూర్తిస్థాయి నియామక నోటిఫికేషన్ విడుదల చేయాలని, 2013లో మంజూరైన ఖాళీ పోస్టులన్నింటినీ భర్తీ చేయాలని గెల్లు శేఖర్ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నిలబెట్టుకుని విశ్వవిద్యాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు.

వికారాబాద్ లో భారీ వర్షం





- చుక్క వర్షం పడని తాండూర్ పరిసర ప్రాంతం
- భారీగా గాలి,దూళి బీభత్సం
- చలికాలంలో వర్షం కురవడం వింత
- మధ్యాహ్నం ఎండా, సాయంత్రం భారీ వర్షం
- వింతగా మారిపోతున్న వాతావరణం

దశ,తాండూర్ ప్రతినిధి: వికారాబాద్‌పట్టణంలో భారీ వర్షం కురిసింది.వర్షం కురవడంతో, జీతురు కాలులు విపరీతంగా వేయడంతో ప్రజలు భయభ్రాంతులకు గురి అయ్యారు. వర్షం పడక చాలా రోజులు అవుతున్న కారణంగా ఈదురుగాలులతో భారీ వర్షం కురవడంతో ప్రజలు మరియు రైతులు ఆనంద కేరింతలు వేశారు. ప్రస్తుతం పడ్డ వర్షం వల్ల రైతులకు కొంతవరకు మేలు జరుగుతుందని, పంటలు కొంతవరకు పండే అవకాశం ఉందని రైతుల పేర్కొంటున్నారు. కానీ కురవవలసిన సమయంలో వర్షం కురవక పోయేడంతో చాలావరకు పంట నష్టం జరిగింది. ఈ కరువును బర్తి చేయాలంటే పూర్తిగా ప్రభుత్వం ఎంత కొంత ఆదుకోవాలని రైతుల డిమాండ్ చేశారు. ఏది ఏదైనా సరే వికారాబాద్ పట్టణ ప్రాంతంలో వర్షం కురువడంతో వాతావరణం చల్లగా మారిపోయింది. చలికాలంలో వర్షం కురవడం కూడా అయోమయంగా మారిపోయింది. వాతావరణం ఏ రోజు ఎలా మారిపోతుందో ప్రజలకు మరియు శాస్త్రవేత్తలకు అర్థం కావడం లేదు.

చల్లటి వర్షంతో ఉపశమనం

వికారాబాద్ పట్టణ ప్రాంతంలో చల్లటి వర్షంతో వాతావరణం చల్లబడింది.ప్రతిరోజు భారీగా ఎండ కొట్టి ఎల్ నీ నో ప్రభావంతో ప్రజలు అల్లాడిల్లిపోయారు.ఈరోజు కొంత వర్షం కురవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వాతావరణం చల్లబడింది. కానీ చలికాలంలో వర్షం కొరవడం వింతగా ఉందని రైతులు గుసగుసలాడుతున్నారు. ఏది ఏదైనా సరే పంటలకు ఎంతో కొంత మేలు చేసే విధంగా వర్షం కురవడంతో ప్రజలు ఆనందంగా ఉన్నారు. అదేవిధంగా ఎండ తాకడికి కొంత ఉపశమనం కూడా లభించిందని చెప్పవచ్చు. నేడు, రేపు కూడా వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఇప్పటికే తెలియజేసింది.

చుక్క వర్షం పడని తాండూర్ ప్రాంతం

ఇదిలా ఉండగా వికారాబాద్ పట్టణ ప్రాంతానికి 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న తాండూర్ పట్టణ ప్రాంతం కానీ, గ్రామాలలో కానీ ఒక చుక్క వర్షం కూడా పడలేదు. దీనితో రైతులు లబోదిబోమంటున్నారు. చల్లటి వాతావరణమే కనిపించిన వర్షం మాత్రం కొరవలేదు. వర్షం పడుతుందేమోనని రైతులు వేయికళ్లతో ఎదురు చూశారు.కానీఒకచుక్కకూడావర్షంరాకపోవడంతో రైతుల నిరాశ చెందారు. వర్షం త్వరగా రావాలని రైతులు, ప్రజలు ఇతరులు ప్రార్థనలు చేస్తున్నారు. దేవుళ్లకు మొక్కుకుంటున్నారు. వేడుకుంటున్నారు. కానీ వాతావరణ శాఖ రెండు రోజులలో వర్షం వస్తే అవకాశం ఉందని తెలపడంతో మరి ఈరోజు కానీ, రేపు కాని వర్షం పడుతదేమో తాండూర్ పరిసర ప్రాంతంలో అని గ్రామాల ప్రజలు, పట్టణ ప్రజలు అనుకుంటున్నారు. ఒకవేళ తాండూరు ప్రాంతంలో వర్షం పడితే ప్రజలు కూడా ఊపిరి పీల్చుకునే అవకాశం ఉంటుంది.

పట్టభద్రుల ఎమ్మెల్సీగా శ్యామ రామ్మోహన్ రెడ్డిని గెలిపించాలి

- డీసీసీ ప్రధాన కార్యదర్శి గండికోట కుమార్.
- సీతాఫల్‌మండి డివిజన్‌లో 100 మంది పట్టభద్రుల వివరాల నమోదు



దశ, ఓయూ: హైదరాబాదు, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యామ రామ్మోహన్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి గండికోట కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సీతాఫల్‌మండి డివిజన్‌లో సుమారు 100 మంది పట్టభద్రుల వివరాలను నమోదు చేసి సంబంధిత నాయకులకు అందజేసినట్లు ఆయన తెలిపారు. పట్టభద్రులంతా ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని కోరారు.

భీమనపల్లి శేఖర్ మాదిగ మృతి పట్ల పలువురి సంతాపం



దశ, మునుగోడు: వెలమకన్నె గ్రామానికి చెందిన భీమనపల్లి శేఖర్ మాదిగ అకాల మరణం చెందడం పట్ల పలువురు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నిన్నటివరకు అందరితో కలిసిమెలిసి, స్నేహభావంతో ఉంటూ అందరి మన్ననలు పొందిన శేఖర్ మాదిగ మరణవార్తను జీర్ణించుకోలేకపోతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. వారి స్వగ్రామంలో నిర్వహించిన అంత్యక్రియలకు పెద్ద అంబర్‌పేట మాజీ కౌన్సిలర్ మల్లెపాక మల్లేష్, బీఎస్పీ నాయకులు నల్ల పరమేశ్వర్, ఆర్.కె. నగర్ వాసులు జాలిగామ మోహన్, ఉపేందర్ ముదిరాజ్, గట్టు నర్సింహ, ఏల భాష తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శేఖర్ మాదిగ భౌతికకాయానికినివాళులర్పించి,వారికుటుంబసభ్యులనుపరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

పారిశుద్ధ్య కార్మికులకు శ్రీవారి ప్రసాదం పంపిణీ

దశ ఓయూ: కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని నాచారంలో ఘనంగా అక్టోబర్ 29, 30,31 తేదీల్లో శ్రీనివాస సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం నాచారం సవకార్ నగర్ కాలనీలో జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు శ్రీవారి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్మికులు భక్తిశ్రద్ధలతో ప్రసాదాన్ని స్వీకరించారు.

వేలేరుపాడులో టీడీపీ ఇంటింటి ప్రచారం



దశ, అశ్వారావుపేట: ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో పోలవరం నియోజకవర్గంలో రాజకీయ వేడి పెరుగుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ (టీడీపీ) వేలేరుపాడు మండలంలో ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేసింది. ఈ క్రమంలో నిర్వహించిన విస్తృత ఇంటింటి ప్రచార కార్యక్రమంలో అశ్వారావుపేట టీడీపీ ఇన్‌చార్జి కట్రం స్వామి దొర పాల్గొన్నారు. గ్రామంలోని వివిధ వీధుల్లో పర్యటిస్తూ ఆయన ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి టీడీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి, స్థానిక సమస్యల పరిష్కారం కోసం టీడీపీ అభ్యర్థుల విజయానికి ప్రజలు సహకరించాలని కట్రం స్వామి దొర విజ్ఞప్తి చేశారు. ఈ ఇంటింటి ప్రచార కార్యక్రమంలో కట్రం స్వామి దొరతో పాటు స్థానిక గ్రామ నాయకులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామాల్లో పార్టీ శ్రేణుల ఉత్సాహం, ప్రజలతో నాయకుల మమేకం ఎన్నికల ప్రచారానికి మరింత ఊపునిచ్చింది.



వ్యవసాయ కళాశాల భూసేకరణ బాధిత రైతులకు న్యాయం చేయాలి

దశ, హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో వ్యవసాయ కళాశాల నిర్మాణం కోసం 1041 సర్వే నంబర్ పరిధిలో భూములు కోల్పోయిన బాధిత రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు అండగా నిలిచి పోరాడతామని 12వ వార్డు కౌన్సిలర్ అమరరాపు ప్రవీణ్ స్పష్టం చేశారు. భూసేకరణ సమయంలో ఇచ్చిన హామీలైన నష్టపరిహారం, ఇందిరమ్మ ఇళ్లు, అర్హులైన కుటుంబాల పిల్లలకు ఉద్యోగ అవకాశాలు ఇప్పటికీ అమలుకాకపోవడం బాధాకరమన్నారు. తమ చట్టబద్ధమైన హక్కుల కోసం రైతులు అధికారుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. భూసేకరణలో జరిగిన అవకతవకలు, సర్వే వివరాలు, పరిహారం చెల్లింపులపై సమగ్ర విచారణ జరపాలనీ కోరారు.పూర్తి నష్టపరిహారంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు,ఉద్యోగ హామీలను లిఖితపూర్వకంగా నమోదు చేసి తక్షణమే పరిష్కరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శీలం శ్రీను నాగమణి, వల్లెపు నాగరాజు,నల్లగొండ శ్రీనాథ్ సుజాత, చిట్టిపోతుల రమేష్,1041 సర్వే నంబర్ పరిధిలోని బాధిత రైతులు పాల్గొన్నారు.

అమిత్ షా పాదయాత్రకు తార్నాక బీజేపీ నాయకుల తరలింపు



- శ్రీరామ్ వెంకట్ ఆధ్వర్యంలో ఐదు బస్సుల్లో 250 మంది కార్యకర్తలు పయనం



దశ, ఓయూ: కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం సాయంత్రం బషీర్‌బాగ్ నుంచి ఎంజే మార్కెట్ వరకు నిర్వహించే పాదయాత్రకు తార్నాకకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. సికింద్రాబాద్ మహంకాళి జిల్లా మేధావుల విభాగం ఇన్‌చార్జి శ్రీరామ్ వెంకట్ ఆధ్వర్యంలో సుమారు 250 మంది కార్యకర్తలు ఐదు బస్సుల్లో బయలుదేరారు. ఈ సందర్భంగా శ్రీరామ్ వెంకట్ మాట్లాడుతూ తార్నాక డివిజన్ అధ్యక్షుడు కరుణాకర్ ఆధ్వర్యంలో కార్యకర్తలు పాదయాత్రలో పాల్గొంటున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా 'లోక్‌తంత్ర బచావో.. అరాచక్ హటావో' నినాదంతో ఈ యాత్ర చేపట్టినట్లు పేర్కొన్నారు. టీఎస్‌పీఎస్సీ, వీఆర్వో నియామకాల విషయంలో ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ నిర్వహిస్తున్న ఈ పాదయాత్రకు ప్రజలు మద్దతు తెలపాలని కోరారు. ప్రజల హక్కుల పరిరక్షణ కోసం బీజేపీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.

మున్సిపల్ కమిషనర్ లాగిన్ నిలిపివేత వెనుక భారీ కుట్ర?..

సర్కారు భూములకు ఇంటి నంబర్ల కేటాయింపుపై ప్రజలు అప్రమత్తం!

దశ, నర్సంపేట: నర్సంపేట మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ అధికారిక లాగిన్స్ (Log ins), డిజిటల్ కీ (Digital Key) గత ఆగస్టు 15వ తేదీ నుండి పనిచేయకపోవడంతో పురపాలక సేవలు పూర్తిగా స్తంభించిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సామాజిక బాధ్యత గల పౌరులు ఎం. ప్రవీణ్, కె. శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై సమగ్ర విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వారు వరంగల్ జిల్లా కలెక్టర్ కి ప్రజావాణిలో లిఖితపూర్వకంగా వినతిపత్రం సమర్పించారు.



మున్సిపల్ కార్యాలయం ద్వారా ప్రజలకు అందాల్సిన పరిపాలనా సేవలు, అధికారిక ధ్రువీకరణ పత్రాలు, అనుమతులు సకాలంలో అందడంలేదని,ముఖ్యంగాజనన,మరణధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న సామాన్యులు నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతూ తీవ్ర మానసిక క్షోభను ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. సాధారణంగా నూతన ఇంటి నంబర్ల కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు క్షేత్రస్థాయి పరిశీలన జరిపి 15 రోజుల వ్యవధిలో కమిషనర్ లాగిన్ ద్వారా ఆమోదం లేదా తిరస్కరణ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుందని, అయితే కమిషనర్ లాగిన్స్ పనిచేయకపోవడం వల్ల అర్హులైన ప్రజల దరఖాస్తులు సైతం దీర్ఘకాలంగా పెండింగ్‌లోనే ఉండిపోతున్నాయని వారు వివరించారు.

ఈ పరిస్థితిని అవకాశంగా తీసుకుని కొందరు అక్రమార్కులు 'డీమ్డ్ అప్రూవల్' (Deemed Ap proval) విధానాన్ని దుర్వినియోగం చేస్తున్నారని వారు తీవ్ర ఆరోపణ చేశారు. కమిషనర్ లాగిన్ ద్వారా తుది ఆమోదం లభించని పలు నూతన ఇంటి నంబర్ల దరఖాస్తులకు డీమ్డ్ అప్రూవల్ లభించినట్లు తెలుస్తోందని, ఈ ప్రక్రియను ఆసరాగా చేసుకుని ప్రభుత్వ, మున్సిపల్ స్థలాలకు సైతం అక్రమంగా ఇంటి నంబర్లు సంపాదిస్తున్నారని పేర్కొన్నారు. ఆ ఇంటి నంబర్లను ఆధారంగా చేసుకుని తప్పుడు రిజిస్ట్రేషన్లు చేయించడం, ఇతర వ్యక్తులకు ఆ స్థలాలను విక్రయించడం వంటి దందాలు సాగుతున్నాయని, దీనివల్ల భవిష్యత్తులో ప్రభుత్వ భూములు పూర్తిగా అన్యాక్రాంతమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ఇంటి నంబర్ అనేది కేవలం గుర్తింపు మాత్రమేనని, అది యాజమాన్య హక్కు కాదని తెలిసినప్పటికీ, దాని ఆధారంగా జరుగుతున్న అక్రమ లావాదేవీలను వెంటనే అరికట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గుర్తుచేశారు.

ఈ సందర్భంగా వారు జిల్లా కలెక్టర్ గారి ఎదుట పలు కీలక అంశాలను ప్రస్తావిస్తూ చర్యలకు విజ్ఞప్తి చేశారు. ఆగస్టు 15 నుండి నేటి వరకు కమిషనర్ లాగిన్స్, డిజిటల్ కీ ఎందుకు పనిచేయడం లేదో విచారించి, సాంకేతిక సమస్యలను వెంటనే సరిచేసి సేవలను పునరుద్ధరించాలని కోరారు. అదేవిధంగా ఈ కాలంలో నూతన ఇంటి నంబర్ల కోసం వచ్చిన మొత్తం దరఖాస్తుల వివరాలు, పెండింగ్‌లో ఉన్నవి, డీమ్డ్ అప్రూవల్ పొందిన దరఖాస్తులు మరియు వాటి అనుమతి తేదీలు, ఆధార పత్రాలను సమగ్రంగా పరిశీలించాలని డిమాండ్‌చేశారు.

ముఖ్యంగా ప్రభుత్వ, మున్సిపల్ భూములకు కేటాయించిన ఇంటి నంబర్లను గుర్తించడానికి రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో సంయుక్త విచారణ జరిపించాలని, నిబంధనలకు విరుద్ధంగా తప్పుడు పత్రాలతో నంబర్లు పొందినట్లు నిర్ధారణ అయితే వాటికి ముందస్తు నోటీసులు జారీ చేసి తక్షణమే రద్దు చేయాలని కోరారు. అలాంటి అక్రమాలకు పాల్పడిన వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే ప్రజలకు జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, నూతన ఇంటి నంబర్లు నిర్దేశిత గడువులో అందేలా ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, మొత్తం వ్యవహారంపై చేపట్టిన చర్యలతో కూడిన నివేదికను లిఖితపూర్వకంగా వెల్లడించి మున్సిపల్ వ్యవస్థలో పారదర్శకతను కాపాడాలని ఎం. ప్రవీణ్, కె. శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.